ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జయశంకర్ భూపాలపల్లి
సోమవారం 22 సెప్టెంబరు 2025



భూపాలపల్లి జవహర్ కాలనీలో బతుకమ్మలతో మహిళలు

భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భూపాలపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఒక్కేసి పువ్వేసి చందమామ..

వైభవంగా ప్రారంభమైన పూల పండుగ

- తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ
- ఊరూవాడా సందడే సందడి
- ఆడిపాడిన మహిళామణులు

బతుకమ్మ వేడుకలు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో మహిళలు ఆడిపాడి సందడి చేశారు. ఉదయాన్నే కల్లాపి చల్లి, ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి, తంగేడు, గుమ్మడి, గునుగు, చామంతి, అల్లిపూలతో బతుకమ్మను పేర్చారు. ఒక చోట చేరి బతుకమ్మను ఆడారు. 'ఒక్కేసి పువ్వేసి చందమామ.. రాశి కలుపుదాం రావే చందమామ' అని పాడుతూ హోరెత్తించారు. 'మన తల్లి బతుమ్మ ఉయ్యాలో.. మన మేలు కోరు ఉయ్యాలో...' అంటూ శృతి అందుకున్నారు. డీజే సౌండ్స్‌కు యువతులు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. కొంతమంది మహిళలు కోలాటాలు వేశారు. దాదాపు అన్ని చోట్లా సాయంత్రం 7 గంటలకు మొదలైన బతుకమ్మ రాత్రి 11గంటల వరకు కొనసాగింది. అనంతరం దగ్గరలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

- భూపాలపల్లి టౌన్/ములుగు (ఆంధ్రజ్యోతి)



ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పేదలకు బాసటగా సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) పథకం బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 69మంది లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.16లక్షల50వేల చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో అవసరమని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యమని, సంక్షేమ పథకాల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫీ, నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, పోలినేని లింగారావు, తక్కళ్లపల్లి రాజు, కటంగూరి రవీందర్‌రెడ్డి, బండి సుదర్శన్, క్యాతరాజు రమేష్, నడిగోటి రాము తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ కన్నెర్ర

మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ శ్రేణులు కన్నెర్రజేశాయి. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి మాజీ సీఎం కేసీఆర్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుపై బీఆర్‌ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఇందుకు మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనునిత్యం ప్రజల వెంట ఉంటూ ప్రతి సమస్యపై వెంటనే స్పందించి భూపాలపల్లి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యేకు లేదన్నారు. కేవలం వ్యాపారాలపైనే దృష్టి సారించిన ఆయన గతంలో ఈ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కరుణాకర్, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బేతల్లి మధూకర్‌రెడ్డి, నాయకులు దాట్ల శ్రీనివాస్, స్వామి, రేణుక, శ్రీనివాస్, రమేష్, రవీందర్, సురేష్, ముంజాల రవీందర్, సాంబమూర్తి, మహేష్‌రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'విషాద'యాత్ర

- దుసపాటిలొద్ది జలపాతం వద్ద ప్రమాదం
- నీట మునిగి యువకుడి మృతి
- ఈత రాకపోయినా కాపాడేందుకు యత్నించిన ముగ్గురు
- వారూ నీట మునుగుతుండటంతో రక్షించిన మరో యువకుడు



మహాశ్విన్ మృతదేహం



స్నేహితులతో మహాశ్విన్ చివరి సెల్ఫీ

వాజేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతం వద్ద ఆదివారం ప్రమాదం జరిగింది. జలపాతంలో నీట మునిగి యువకుడు మృతి చెందాడు. స్నేహితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన మహాశ్విన్ (18), హర్షారెడ్డి, శివారం, అర్జున్, అభిరామ్, సాక్షిత్‌తో పాటు దంపతులు రాకేష్, పూజ స్నేహితులు. వీరంతా కలిసి ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో బయల్దేరి వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతం వద్దకు వచ్చారు. ఉదయం 8.30 గంటల సమయంలో చేరుకున్నారు. ప్రకృతి అందాలను వీక్షిస్తూ జలపాతం వద్ద సందడి చేశారు. వీరిలో మహాశ్విన్ జలపాతం కింది భాగంలో ఉన్న నీటి అంచు భాగంలో నిలబడి ఫొటోలు తీసుకుంటూ ఒక్కసారిగా నీటిలోకి జారిపడ్డాడు. మునిగిపోతున్న అతడిని పక్కనే ఉన్న పూజా, శివరాం, హర్షారెడ్డి ఈత రాకపోయినప్పటికీ కాపాడేందుకు నీటిలోకి దూకారు. పూజను పట్టుకునేందుకు మహాశ్విన్ యత్నించినా ఫలితం లేకుండా పోయింది. పూజా, శివరాం, హర్షారెడ్డి సైతం మునిగిపోతుండగా ఒడ్డున ఉన్న వీరి స్నేహితుడు అర్జున్ నీటిలోకి దూకి ఈత రాకపోయినప్పటికీ వారు ముగ్గురిని ఒడ్డుకు చేర్చాడు. అప్పటికే మహాశ్విన్ నీట మునిగి గల్లంతయ్యాడు. ఈ క్రమంలో స్నేహితులు స్థానికుల సాయంతో పోలీసులకు, అటవీ, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్థానిక ఈతగాళ్ల సాయంతో మహాశ్విన్ మృతదేహాన్ని వెలికి తీశారు.

మహాశ్విన్ హైదరాబాద్‌లో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నాడు. తండ్రి పవన్ సాయి గణేష్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇద్దరు కొడుకులను చదివిస్తున్నాడు. పెద్దకొడుకు మృతితో కుటుంబం విషాదం అలుముకుంది. అప్పటి వరకు తమతో ఉన్న మహాశ్విన్ మృతి చెందడంతో స్నేహితులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని జలపాతం వద్ద నుంచి కొంగాల వరకు తీసుకొచ్చి అక్కడి నుంచి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. వాజేడు (మిగతా 8వ పేజీలో)

యజ్ఞంలా మేడారం పనులు

- చరిత్రలో నిలిచేలా శాశ్వత అభివృద్ధి
- వనదేవతల కీర్తిని భావి తరాలకు అందించడమే లక్ష్యం
- అధికారులు సమన్వయంగా వ్యవహరించి పనులు పూర్తి చేయాలి
- పూజారుల సూచనలు పాటించాలి
- 2వేల మంది వర్కర్లతో పనులు చేపడుతున్నాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మేడారంలో అభివృద్ధి పనులను యజ్ఞంలా చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. చరిత్రలో నిలిచేలా శాశ్వత పనులకు శ్రీకారం చుట్టామని, సమ్మక్క-సారలమ్మ తల్లుల కీర్తిని భావితరాలకు అందించాలన్నదే లక్ష్యమని తెలిపారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో మేడారంలో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. దేవస్థానం ప్రాంగణం, పరిసరాలను పరిశీలించారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల స్థలాల మార్పు, ప్రాకారం విస్తరణ, మాస్టర్ ప్లాన్ డిజైన్, అతిథి గృహాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులపై కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తోపాటు వివిధ శాఖల అధికారులతో చర్చించారు. సెక్టార్ల వారీగా అభివృద్ధి పనుల బాధ్యతలను అధికారులకు అప్పగించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీతక్క మాట్లాడారు. గుడి నిర్మాణ పనుల్లో అధికారులు అందరూ తమదైన బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ముందుగా ఏ పనులు చేపట్టాలో పూజారులను అడిగి తెలుసుకోవాలన్నారు. పనులన్నీ ఓ యజ్ఞంలా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ ఎలాంటి దురుద్దేశం ఉండొద్దని అన్నారు. రాష్ట్రంలో గిరిజన దేవస్థానానికి ప్రపంచ ప్రఖ్యాతి పొందాలనే సంకల్పంతో ప్రభుత్వం వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగానే 2వేల మంది వర్కర్లతో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. వీటిని అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తల్లులపై ఉన్న భక్తిశ్రద్ధలతోనే చరిత్రలో నిలిచేలా శాశ్వత నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. 2026జనవరి 28న జరిగే సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు వచ్చే భక్తులకు సంపూర్ణ దర్శనం కలిగేలాఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

సీఎం పర్యటనపై సమీక్ష

అనంతరం గద్దెల పరిసరాలలోని పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. సెక్టార్ల వారీగా నియమించిన పనులను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వహించి సీఎం పర్యటనను విజయవంతం చేయలన్నారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కల్యాణి, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలు జరుగుతాయి.. జాగ్రత్త!

జిల్లా వాసులకు ఎస్పీ కిరణ్ ఖరే సూచనలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదిన వేళ దొంగతనాలకు ఆస్కారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పలు జాగ్రత్తలు పాటించాలని భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. దసరా సెలవులపై చాలా మంది తమ సొంతూరుకు వెళ్తుంటారని, తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. దొంగతనాలు జరగకుండా పోలీసుల గట్టి భద్రత ఉంటుందని తెలిపారు. గస్తీని ముమ్మరం చేసి, నిరంతరం క్రైమ్ విభాగం పర్యవేక్షణను పటిష్ఠం చేస్తామని పేర్కొన్నారు. సొంతూరుకు వెళ్లే వారు ఇంట్లో విలువైన బంగారం, నగదు ఉంచొద్దని సూచించారు. ఎక్కువ రోజులు సొంతూళ్లలో ఉండే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చుట్టుపక్కల వారిని గమనిస్తూ ఉండమని చెప్పాలని పేర్కొన్నారు. కాలనీల్లో ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు గానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ 8712658159 నెంబర్‌కు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

అదరహో 'చాకలి ఐలమ్మ'

- కాళోజీ కళాక్షేత్రంలో అలరించిన నృత్యనాటకం
- అద్భుతంగా అలేఖ్య పుంజాల నటనా కౌశలం
- ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన చాకలి ఐలమ్మ నృత్య నాటిక అదరహో.. అనిపించేలా చేసింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రేక్షకులతో కాళోజీ కళాక్షేత్రం కిటకిటలాడింది. సమస్త జిల్లా యంత్రాంగం, మంత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నృత్య నాటికను ప్రారంభించారు.

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళ యోధురాలు చాకలి ఐలమ్మ గాధను ప్రేక్షకులకు నాట్య ప్రదర్శన ద్వారా అందించారని కొనియాడారు. ఐలమ్మగా అద్భుత ఆహార్యంతోపాటు నటన కౌశలాన్ని ప్రదర్శించిన సంగీత, నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాలను ఆయన అభినందించారు. నేటితరం యువతకు చాకలి ఐలమ్మ వంటి విప్లవ మహిళల గురించి తెలియజేసేలా ఉన్న ప్రదర్శన అద్భుతమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, దనసరి సీతక్క, రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాలతోపాటు నాటకంలో పాల్గొన్న కళాకారులను మంత్రులు ఘనంగా సత్కరించారు. వడ్డెపల్లి కృష్ణ అద్భుతంగా రాసిన చాకలి ఐలమ్మ నృత్య నాటకానికి వీబీఎస్ మురళి సంగీత స్వరాలను సమకూర్చారు. 45 నిమిషాల పాటు కొనసాగిన నాటకం ఆద్యంతం ప్రేక్షకులను కుర్చీల నుంచి కదలనీయలేదు. తెలంగాణ భూసంస్కరణ చరిత్రలో ఒక అధ్యాయంగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితాన్ని ఆధునిక రంగస్థలంపై నాట్య రూపంలో తీసుకొచ్చిన అలేఖ్య పుంజాల, ఇతర కళాబృందాన్ని ప్రేక్షకులు పలుమార్లు కరతాళ ధ్వనులతో అభినందించారు.

నేటి కార్యక్రమాలు

కాళోజీ కళాక్షేత్రంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న నృత్య నాటకోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 6 గంటలకు వరంగల్‌లోని తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదానందం రాసిన రాణిరుద్రమ నాటక ప్రదర్శనతోపాటు గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాసాహిత్య కళారూపాలు జీవన సంఘర్షణ పేరిట అరుదైన నృత్యరూపక ప్రదర్శనను నిర్వహించనున్నారు.

తగ్గుతూ పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి దోబూచులాడుతోంది. తగ్గుతూ పెరుగుతూ ప్రవహిస్తోంది. రెండు మూడు రోజులు 10 మీటర్ల నుంచి 9 మీటర్ల వరకు 9 మీటర్ల నుంచి 10 మీటర్ల ఎత్తుతో ప్రవహిస్తూ ఉంది. తాజాగా ఆదివారం 9.78 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవహిస్తోందని అధికారులు తెలిపారు.

పండగపూట పాఠాలు

● నలంద పాఠశాలలో తరగతులు ● ఎంఈవో తీవ్ర ఆగ్రహం



నలంద పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్న సిబ్బంది

తొర్రూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులోని నలంద పాఠశాల పేరుతో నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం అమావాస్య బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరుతో పండగ పూట పాఠాలు నిర్వహించడంతో విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపకులు మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ పండగ పూట విద్యార్థులకు తరగతులు ఏమిటని తీవ్రంగా ప్రశ్నించారు. ప్రభుత్వం పండగ పేరుతో సెలవులు ఇస్తే పాఠశాల యాజమాన్యం ర్యాంకుల పేరుతో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు వచ్చిన హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు విద్యార్థులను తరగతి గది నుండి ఇంటికి పంపించారు. సంబంధిత ఎంఈవోను వివరణ కోరగా పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి



చిన్నగూడూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు


చిన్నగూడూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28న జరిగే లంబాడీల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని మండల సేవాలాల్ సేన అధ్యక్షుడు బాదావత్ సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేసి లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులతో కలిసి ఆత్మగౌరవ సభ కరపత్రాలు ఆవిష్కరించారు. 28 జరిగే సభకు పెద్దఎత్తున తరలిరావాలని తెలిపారు. కరే ధారాసింగ్, సర్యా, యాకీ, హుస్సేన్, చిరంజీవి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

తొర్రూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన ఎంగిలిపూల అమావాస్య బతుకమ్మ వేడుకలు ఆదివారం తొర్రూరు పట్టణంలోని పెద్ద చెరువు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తొర్రూరు మాజీ సర్పంచ్ పెదగాని కళావతి సోమయ్య మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకుంటారని, ఆడబిడ్డలందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



బతుకమ్మలతో చెరువు వద్దకు వెళ్తున్న మహిళలు



WANTED
★ హస్పిటల్ పనిచేయుటకు PRO's ఫార్మసిస్ట్, రిసెప్షనిస్ట్ మరియు ఆయాలు (వసతి కల్పించబడును) బేబీస్ లైఫ్ హస్పిటల్ కాకాజీ కాలని హన్మకొండ. సెల్.నెం :9032753764
AJW-243430

HOUSE FOR SALE
★ WGL, కరీమాబాద్ S.R.R తోటలో 144.6 Sq.Yards G+3 ఫ్లోర్స్ డూప్లెక్స్ 100% వాస్తు & Owner కట్టించిన West Facing గల ఇల్లు అమ్మబడును. సం॥ప్ర॥ 9440005067, 9515980598
AJW-429

WANTED
★ సుబేదారిలో చాయ్ షాపులో పనిచేయుటకు స్త్రీ/పురుషులు వర్కర్ కావలెను. ఉదయం 6గం॥ నుండి సాయంత్రం 7:30 వరకు జీతం : 9,000-10,000 వయస్సు : 20-40సం॥. సెల్ : 9700871260
AJW-243509

PROPERTY FOR SALE
★ 300 sq.yds Open Plot For Sale in Chintal. Warangal. Contact Phone No. 9573999953 / 9848767271
AJH-3011

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు టెలికాలర్స్ మరియు సిస్టమ్ అపరేటింగ్, రిసెప్షనిస్ట్ కావలెను. జీతం: 8,000/-, 10,000/-. సం॥ప్ర॥ 9000463426
AJW-243428

LEASE / SALE
★ హన్మకొండ మెయిన్ సెంటర్లో మంచి రన్నింగ్ కండిషన్‌లో ఉన్న హోటల్ లీజ్‌కి లేదా సేల్ చేయబడును. సెల్ : 7569268606
AJW-243429

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/, 14,000. సం॥ప్ర॥9666336163
AJW-243428

WANTED
★ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ (హన్మకొండ) డిజిటల్ మరియు సోషల్ మీడియా మార్కెటింగ్ కొరకు 1 నుండి 3సం॥ల అనుభవం మరియు నైపుణ్యం గల అభ్యర్థులు కావలెను. సం॥ప్ర॥ 9010591950.
AJW-243502

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు **రూ. 250/-** మాత్రమే.
అదనపు లైనుకు **రూ. 45/-**
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

శిథిలావస్థలో ఆకేరువాగు రాతి ఆనకట్ట

● పట్టించుకోని అధికారులు ● అధ్వాన్న స్థితిలో ఆనకట్ట దారి ● మరమ్మతులు చేయాలని రైతుల డిమాండ్



ఆకేరు వాగు రాతి ఆనకట్ట ఇదే



ఆనకట్ట పై భాగం



శిథిలావస్థకు చేరిన ఆనకట్ట తూములు

నెల్లికుదురు సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల పాలిట కల్పతరువుగా పేరొందిన ఆకేరు ఆనకట్టు అక్కరకు రాకుండా పోతోంది. వందలాది ఎకరాలకు సాగునీరందించే ఆనకట్టు ఆయువు పట్టు లేకుండా పోతోంది. భూగర్భ జలాలను పెంపొందించడానికి, గుర్తూరు, ఎర్రబెల్లిగూడెం గ్రామాలకు రహదారిగా బహుళ ప్రయోజనకరంగా ఉండేందుకు సుమారు 200 ఏళ్ల క్రితం ఆకేరు వాగు వద్ద మొదటి ఆనకట్టను నిర్మించారు. అది నేడు శిథిలావస్థకు చేరి బీటలు వారుతోంది. డంగు సున్నం, రాతిబండలతో నిర్మించిన పురాతనమైన ఆనకట్ట ఆహుతులను ఆకట్టుకునేట్టుగా ఉంటుంది. పూర్వం రైతులకు సాగునీరు అందక అల్లాడుతుండేవారు అది గమనించి ఎలాగైన ఆకేరువాగుకు అడ్డంగా ఆనకట్టను నిర్మిస్తే వాగు ప్రవహిస్తే నాలుగు గ్రామా ల రైతులకు నీరు అందించాలనే లక్ష్యంతో నెల్లికుదురు మండలం రామన్న గూడెంకు చెందిన పూర్వీకులు కొంతమంది ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాతి ఆనకట్టను నిర్మించి ఆనకట్ట కాలువ ద్వారా మండలంలోని ఎర్రబెల్లిగూడెం 70 ఎకరాలకు, రామంజాపురం 50 ఎకరాలకు, కాచికల్ 321 ఎక రాలకు, రామన్నగూడెం 109 ఎకరాలకు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో నిర్మించారు, ఆనకట్టనుంచి నెల్లికుదురు చెరువు వరకు ఐదు కిలోమీటర్ల పొడవు కాలువ నిర్మించారు. వర్షాకాలంలో కాలువ ద్వారా నాలుగు గ్రామాల రైతులకు సాగునీరు అందుతోంది. మిగిలిన నీరు నెల్లికుదురు చెరువుతో పాటు పులికంట చెరువులు నిండి 817 ఎక రాలకు నీరు అందుతుంది ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఆనకట్టను మిషన్ కాకతీయ పనుల్లో విస్మరించారని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం కట్టు కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టి మూడు కిలో మీటర్ల దూరం వేశారు. మరోరెండు కిలో మీటర్ల దూరం మరమ్మతులు చేయకపోవడంతో రామన్నగూడెం, కాచికల్ గ్రామాల మధ్య తరచూ కాలువకట్టకు గండిపడి నీరు వృథా అవుతుంది.. కాంట్రాక్టర్లు తాత్కాలిక మరమ్మతు గండ్లు పూడ్చి నీరు అందిస్తున్నారు. ఆనకట్టకు అక్కడక్కడ బీటలు ఏర్పడడంతో నీరు కాలవలోకి వెళ్లకుండా ఆకేరు వాగు కింది వృథాగా వెళ్లి పోతుంది. ఆనకట్ట ముందు భాగం పూడికతో నిండి నీరు ఎక్కువగా నిల్వ ఉండకపోవడంతో వేసవిలో భూగర్భజలాలు తగ్గి బావులలో నీరు ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్టనుంచి నెల్లికుదురు చెరువులోకి నీరు వచ్చే కాలువకు గతంలో రూ. 70 లక్షలతో పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించి వదిలేశారు . మళ్లీ పను లు పునఃప్రారంభించి పనులు వేగవంతం చేసి చెరువులోకి నీరు వచ్చేచవిధంగా కృషిచేయాలని రామన్నగూడెం రైతులు కోరుతున్నారు.

మరమ్మతుకు నోచుకోని తూములు

ఆనకట్ట వద్ద నిర్మించిన మూడు తూములతో పాటు కాలువకు అక్కడక్కడ నిర్మించిన తూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. నీటి ఉధృతికి తెగిపోయే అవకాశం ఉంది. ఆనకట్టనుంచి కాలవ వెళ్లే తూముల వద్ద చెట్లు మొలిచి నీరు కాలవలోకి రాకుండా అడ్డుపడుతున్నాయి. నీరు వృథాగా వెళ్లి పోవడంతో చెరువులు త్వరగా నిండడంలేదని తూములు మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

గుంతలమయమైన ఆనకట్ట దారి

ఎర్రబెల్లిగూడెం నుంచి ఆనకట్ట మీదుగా గుర్తూరుకు వెళ్లే దారి బురదమయమైంది దీంతో ఆనకట్ట వద్దకు వెళ్లడానికి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కట్టుకాలువ కట్టను వెడల్పుచేసి, దారి మరమ్మత్తులు చేసి ఆనకట్టను వెడల్పు చేసి రామన్నగూడెం కచికల్ , గుర్తూరు , సోమారం, అన్నారం గ్రామాలకు రవాణ సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆనకట్టను వెడల్పు చేయాలి
- పల్లె యాకయ్య, రైతు ఎర్రబెల్లిగూడెం



ప్రభుత్వం నిధులు విడుదలచేసి ఆనకట్టను వెడల్పు చేసి పూడిక తీయించాయి. రైతులకు నీరు అందించాలి. ఆనకట్ట వద్ద కట్టను వెడల్పు చేయాలి. తూములను మరమ్మతు చేసి లీకేజీలను అరికట్టాలి.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు ఎక్కడ..?

● ఇబ్బందులు పడిన మహిళలు ● 11 లక్షల 50వేల నిధులు కేటాయింపు ● అలసత్వం వహించిన వైనం

తొర్రూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుక మ్మ పండుగ వేడుకలకు తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు వద్ద ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఆదివా రం నిర్వహించిన ఎంగిలి పూల బతుకమ్మకు వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు గత పది రోజుల క్రితమే ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి టెండర్ పిలిచి పనులు చేయాలని ఆదేశించినా అధికారులు ఏర్పాట్లు చేయడంలో తీవ్ర అలసత్వం వహించారు. డివిజన్ కేంద్రమైన తొర్రూరులో సుమారు 10వేల మంది మహిళలు చెరువు వద్దకు హాజరైన మహిళలకు బురద గుంటలు, దారి సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహిళలు చెరువు వద్దకు వచ్చిన తర్వాత మునిసిపల్ సిబ్బందితో పనులు చేయించారు. బతు కమ్మ ఆట ఆడిన అనంతరం రాకపోకలకు సైతం మహిళలు ఇబ్బందు లు పడ్డారు. మునిసిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. దీంతో ప్రభుత్వం కేటాయించిన నిధులు వృథాగా పోయాయని సంబంధిత ఉన్నతాధికారులు సద్దుల బతుకమ్మ లోపు పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చెరువు వద్ద శానిటేషన్ పనులు చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



బాపూజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

తొర్రూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో పద్మశాలి సం ఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటులో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలకమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు కోట వెంకటేశ్వర్లు, బుదరాపు శ్రీనివాస్, ఈశ్వర్, గడ్డం రాజు, యాకన్న, శంకర్, కస్తూరి పులేందర్, రవీంద్ర కుమార్, వెంకట్, పరమేష్ పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం

● జంపన్నవాగులో మునిగి యువకుడి మృతి



యువకుడి మృతదేహం

ఏటూరునాగారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో పండుగ పూట విషాద సంఘటన జరిగింది. ఏటూరునాగారం మండలం జంపన్న వాగులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగపేట మండలం బోర్‌నర్సాపురానికి చెందిన కోడి వెంకటేశ్వర్లు(25) నాలుగు రోజుల క్రితం ఏటూరునాగారంలోని తన అత్తగారింటికి వచ్చి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఆస్పత్రి నుంచి బయటకు వచ్చి జంపన్నవాగులో స్నానం చేయడానికి వెళ్లి గల్లంతయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, ఆదివారం సాయంత్రం అతడి మృతదేహం లభ్యమైంది. ఎస్సై ఎన్. రాజ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓసీలు హక్కులను కాపాడుకోవాలి

● రాష్ట్ర కన్వీనర్ జైపాల్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓసీలందరూ ఐక్యంగా ఉండి ఉద్యమాల ద్వారా హక్కులను కాపాడుకోవాలని ఓసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ గోపు జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలో రెడ్డిసంఘం జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ పిచ్చిరెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో జైపాల్‌రెడ్డి మాట్లాడారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు తదితర సమస్యలపై అక్టోబరులో వరంగల్‌లో నిర్వహించే సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈసమావేశంలో రెడ్డి, వెలమ, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొమురవెల్లి రమేష్, కామిడి సతీష్‌రెడ్డి, చింతలపూడి భాస్కర్ రెడ్డి, వేల్పూరి సత్యనారాయణరావు, మాదారపు వెంగళరావు, గంగిశెట్టి శ్రీనివాస్, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, శిరుప సతీష్‌కుమార్, కొమురవెల్లి సతీష్‌కుమార్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గంగిశెట్టి రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఓసీ సంఘాల నాయకులు

ప్రమాద సూచిక ఫ్లెక్సీల ఏర్పాటు



ప్రమాద సూచిక ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న బీజేపీ నాయకులు

జఫర్‌గడ్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేట గ్రామ శివారులో దెబ్బతిన్న రహదారుల పక్కన బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రమాద సూచిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ మాట్లాడుతూ జఫర్‌గడ్ - తిమ్మంపేట - స్టేషన్‌ఘన్‌పూర్ ప్రధాన బీటీ రహదారి పలుచోట్ల దెబ్బతిని లోతైన గుంతలు పడడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రమాదాలు జరగకుండా దెబ్బతిన్న రహదారి పక్కన ప్రమాద సూచిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు ముస్కు స్వప్న, మండల ప్రవీణ్‌కుమార్, నర్సింగోజు స్వామి పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో బతుకమ్మ సంబరాలు



పెర్త్ నగరంలో ఎంగిలి పూల బతుకమ్మ ఆడుతున్న తెలుగువారు

కాటారం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ఖండాంతరాలు దాటిన వేడుకగా సాగుతున్నాయి. ఆస్ట్రేలియా దేశంలోని పెర్త్ నగరంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాసులు, కాటారం డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు, పిల్లలు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎక్కడ పని చేస్తున్నా సంప్రదాయాలను మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించడానికి కృషి చేస్తున్నామని పలువురు అక్కడి తెలంగాణ మహిళలు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

● దివంగత జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి కుమార్తె సంజనారెడ్డి

చిలుపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడాకారులుగా ఎదగాలని దివంగత జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి కుమార్తె పాగాల సంజనారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాజవరంలో ఆమె తండ్రి సంపత్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న రాజవరం ప్రీమియర్ లీగ్(ఆర్‌పీఎల్) 12వ సీజన్ క్రికెట్ క్రీడా పోటీలను అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లందుల సుదర్శన్, బత్తుల రాజన్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజనారెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి స్మారకార్థం క్రికెట్ పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడలతో పాటు చదువుపై యువత ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాగాల వెంకట్‌రెడ్డి, మోటం రాజు, నారబోయిన కనకరాజు, రంగు రవి, ఎడ్ల రాజేశ్, శంకర్, నిర్వాహకులు ఎమ్డీ.అసదుద్దీన్, ఎడ్ల అబ్రహం, ఇల్లందుల వెంకటస్వామి, ఇరుగు రాజు, విష్ణు, అశోక్, ఎడ్ల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



రాజవరంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సంజనారెడ్డి

గారెపల్లి వాసికి యాక్టివిస్ట్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న సతీష్

కాటారం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ దాసరి నారాయణరావు స్మారక ప్రతిభ కళా సేవా బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్-2025 అవార్డు భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గారెపల్లికి చెందిన కొట్టె సతీష్ అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న, మా అసోసియేషన్ ఈసీ మెంబర్ మాణిక్‌రావు చేతులమీదుగా సతీష్ అవార్డు అందుకున్నారు. స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడైన సతీష్ కరోనా సమయంలో అందించిన సేవలు, పేద విద్యార్థులకు అందిస్తున్న సహాయ సహకారాలను చూసి అవార్డు అందజేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



బాపూజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పద్మశాలి నాయకులు

పాలకుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని పురస్కరించుకొని పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో ఆదివారం పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు మేడారపు సుధాకర్ మాట్లాడుతూ ఆయన జీవితమే తెలంగాణ ఏర్పాటు కోసం అంకితమైందని అన్నారు. 1969లో రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కటబత్తిని రమేష్, చిదిరాల మార్కండయ్య, పెనుగొండ వెంకటేశ్వర్లు, రమేష్, సోమేశ్వర్, నాగయ్య, పుండరీకుడు, కాటబత్తిని సోమేశ్వర్, చిలకమారి శ్రీధర్, ఎనగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి



కుమారస్వామి (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటం కుమారస్వామి(50) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్‌ఘన్‌పూర్ బుడగజంగాల కాలనీకి చెందిన కుమారస్వామి శనివారం రాత్రి స్థానిక బస్టాండ్ వద్ద జాతీయ రహదారిని క్రాస్ చేస్తుండగా జనగామ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుమారస్వామి భార్య అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.


మహబూబాబాద్ జిల్లా కాంపెల్లి గ్రామంలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు


తొర్రూరులో పెద్ద బతుకమ్మతో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, బీరప్ప మైత్రి మహిళా సొసైటీ సభ్యులు


జనగామ జిల్లా కేంద్రంలోని 17వ వార్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

» ఎంగిలిపూలతో బతుకమ్మ సంబరాలు షురూ » ఆడిపాడిన మహిళలు

తెలంగాణలో పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ. పూలను ఒక పాత్రలో పేర్చి తీసుకెళ్లి సమీపంలో గుడి, చెరువు, వాగుల వద్ద ఆడిపాడతారు. పెత్తర (పెద్దల) అమావాస్య రోజు పెద్దలకు బియ్యం ఇస్తారు. అనంతరం బతుకమ్మను పేర్చే విధానాన్ని ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ఆదివారం మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.


జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలోని రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో ..


వేయి స్తంభాల దేవాలయం వద్దకు బతుకమ్మతో వస్తున్న మహిళలు


ములుగు జిల్లా కేంద్రంలోని శివాలయం వద్ద..


వేయి స్తంభాల ఆలయం వద్ద గగన వీక్షణంలో ఇలా..


హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ప్రాంగణంలో..


వరంగల్‌లో బతుకమ్మలతో వస్తున్న చిన్నారులు, మహిళలు



గీసుగొండలో బతుకమ్మను పేరుస్తున్న ఓ కుటుంబం




వరంగల్ కాశీ విశ్వేశ్వరాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పండగవేళ పరేషాన్.!

- » తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్న దొంగలు
- » సొంతూళ్లకు వెళ్తున్న వారికి చోరీ గుబులు
- » ఆగమాగంగా బయలుదేరితే ఇల్లు గుల్లే..
- » సొమ్ము రికవరీ అయిన దాఖలాలు తక్కువ





వరంగల్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పండగలప్పుడు తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇళ్లను లూటీ చేయడం ప్రతి పండగ సమయంలో జరుగుతున్నాయి. గ్రామాల నుంచి బతుకుదెరువు కోసం నగరాలకు వచ్చి నివాసం ఉంటున్న కుటుంబాలు పండగల సమయాల్లో సొంతూళ్లకు వెళ్తుంటారు. ఇళ్లకు తాళాలు వేసి కుటుంబమంతా సొంతూళ్లకు పయనమవుతారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు ఇళ్లను లూటీ చేస్తున్నారు. పండగ అనంతరం యథావిధిగా నగరాలకు వచ్చేసరికి ఇళ్లంతా ఊడ్చేసి ఉండడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇళ్లలో మనుషులున్నా దుండగులు ఆయుధాలతో బెదిరించి దోపిడీ చేసిన ఘటనలూ ఉన్నాయి.

రెచ్చిపోతున్న దొంగలు

రాత్రివేళ పోలీసులు అర్ధరాత్రి 2లోపు పెట్రోలింగ్ విధులు ముగించుకుని పోలీస్‌స్టేషన్లకు చేరడం.. లేదంటే ఏదో ఒక ప్రాంతంలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అదే అదనుగా తీసుకొని దొంగలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగలు అర్ధరాత్రి 2 నుంచి తెల్లవారుజామున 4లోపు తమ పని కానిస్తున్నారు. నగర ప్రాంతాల్లో రాత్రి 1గంట వరకు జనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తుంటారు. ఆ సమయంలో కాకుండా అర్ధరాత్రి 2 తర్వాత దొంగతనాలు చేస్తున్నారు. ఆ సమయంలో పోలీసులు దృష్టి సారిస్తే దొంగలకు చెక్ పెట్టొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరంలో జరిగిన చోరీలు అర్ధరాత్రి 2 నుంచి 4 గంటలలోపు జరిగినవే ఎక్కువగా ఉన్నాయి.

ఇటీవల జరిగిన చోరీ ఘటనలు

- జూలై 26న హనుమకొండ రెడ్డికాలనీ, కృష్ణ కాలనీలో తాళాలు వేసి ఉన్న నాలుగు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లారు.

- ఈ నెల 14న స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంటగది తాళాలను పగులగొట్టి వంట పాత్రలు ఎత్తుకెళ్లారు.

- ఈ నెల 15న నల్లబెల్లి పీఎస్ పరిధిలోని రుద్రగూడెంలో అడిదెల దేవమ్మ వ్యక్తిగత పనుల కోసం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. దొంగలు తాళం పగలగొట్టి 3 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. అదే గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి ఇంటికి తాళం వేసి వేరే దగ్గర ఉంటుండడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు.


- తాజాగా గత శనివారం రాత్రి వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సంగెం, గీసుగొండ పీఎస్‌ల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు పలుచోట్ల దాడులు చేసి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గీసుగొండ పీఎస్ పరిధిలోని సింగ్యాతండాలో చోరీకి ప్రయత్నించగా స్వామి అనే వ్యక్తి ప్రతిఘటించడంతో దుండగులు బండరాయితో కొట్టి గాయపరిచారు. అదే తండాకు చెందిన వృద్ధురాలు భద్రమ్మను గాయపరిచి 2 తులాల బంగారు చెయిన్, రూ.30 వేల నగదు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. విశ్వనాథపురంలోని వాంకుడోత్ రవీందర్ ఇంట్లో అర తులం బంగారు, 15 తులాల వెండి, భూక్య భిక్షపతి ఇంట్లో 20 తులాల వెండి, రూ.8వేల నగదు, అకినెపల్లి ప్రదీప్ ఇంట్లో తులంన్నర బంగారు బ్రాస్‌లెట్, రూ.8 వేల నగదును చోరీ చేసినట్లుగా స్థానికులు వెల్లడించారు. సంగెం పీఎస్ పరిధిలోని రేక్యానాయక్ తండాలోని రాజ్ కుమార్ ఇంట్లో రూ.2 లక్షల నగదు, 3తులాల బంగారం, 32 తులాల వెండిని ఎత్తుకెళ్లారు.

అప్రమత్తతే ఆయుధం

ఇల్లును వదిలి రెండు మూడు రోజులు ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు ఉంటే తమ వెంట తీసుకెళ్లాలి. లేక రక్షణ ఉన్న ప్రాంతాల్లో విలువైన సామాన్లను భద్రపరుచుకుంటే చోరీలకు గురికాకుండా కాపాడుకోవచ్చు. ఇంట్లో ఎవరూ లేరనే విషయాన్ని బయటి వ్యక్తులకు తెలియకుండా గోప్యత పాటించాలి. దీంతో చోరీ జరగడానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. బతుకమ్మ, దసరా పండగకు పిల్లలకు 15 రోజుల సెలవులు రావడంతో విలువైన వస్తువులను అజాగ్రత్తగా వదిలివేయకుండా రక్షణ ఉన్న ప్రదేశాల్లో భద్రపరుచుకుంటే దొంగల బెడద నుంచి తప్పించుకోవచ్చు.

పోలీసుల సూచనలు పాటించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



- గ్రామాలకు వెళ్లే ప్రజలు పోలీసుల సూచనలను పాటించాలి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసకుంటున్నాం. ఊళ్లకు వెళ్లేవారు ఈ కింది నిబంధనలు పాటించాలి.
- సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో అలారం మోషన్ సెన్సార్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- ఊరికి వెళ్లే ముందు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో లేదా గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలి. లేదంటే వెంట తీసుకెళ్లాలి.
- ద్విచక్ర వాహనాలను చైన్స్‌తో లాక్ చేయాలి.

నమ్మకమైన వ్య క్తులనే సర్వెంట్ లేదా సెక్యూరిటీ గార్డ్‌గా నియమించుకోవాలి.
- ట్రావెల్ ప్రాంతాల లొకేషన్స్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌డేట్ చేయొద్దు.
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని మొబైల్‌లో ఎప్పటికప్పుడు లైవ్‌లో ఇంటి పరిసరాలను గమనించాలి. తాళం వేసిన తర్వాత కనపడకుండా కర్టెన్ వేయాలి. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- ఇంట్లో లేనప్పుడు ఎవరినైనా ఒకరిని ఇంటి ముందు వాకిలి ఊడ్చాలని, ఇంటి ముందు న్యూస్ పేపర్స్, పాల ప్యాకెట్లు జమ కాకుండా చూసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు డయల్ 100కు ఫోన్ చేయాలి.

మహిళలు శక్తి సంపన్నులుగా ఎదగాలి

- » అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి
- » డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

- » నగరంలో కనులపండువగా బతుకమ్మ వేడుకలు
- » అధికార గణంతో కళకళలాడిన వేయిస్తంభాల ఆలయం
- » బతుకమ్మను ఎత్తుకున్న మంత్రులు


వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చిత్రంలో మంత్రులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలంతా శక్తి సంపన్నులుగా ఎదగాలన్నదే తమ కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతమని, దీనికి ఈ నవరాత్రి ఉత్సవాల అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ మల్లు భట్టి విక్రమార్క ఆకాక్షించారు. తెలంగాణ సాంస్కృతిక పర్వంగా పేరున్న బతుకమ్మ తొలినాటి ఉత్సవాలను చారిత్రక వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హైదరాబాద్ తరువాత అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న ఓరుగల్లు అభివృద్ధిపై తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. తెలంగాణ పర్వమైన బతుకమ్మ వేడుకలను పెద్దఎత్తున నిర్వహించాలకున్న క్రమంలో తొలినాటి చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో నిర్వహింపజేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కాకతీయులు నిర్మించిన చారిత్రక ఆలయంలో మన సంస్కృతిని చాటే బతుకమ్మ పర్వాన్ని జరుపుకోవడం ఒక అద్భుత సన్నివేశమని అభివర్ణించారు. మహిళల సమైక్యతా సంఘటిత శక్తికి ప్రతిరూపమే బతుకమ్మ పర్వమన్నారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా బతుకమ్మ పాటలు పాడుతూ సంస్కృతిని చాటుతుండటం తెలంగాణకే చెల్లిందన్నారు. బతుకమ్మ పాటల్లో మానవుడి జనజీవన విధానం, సామాజిక స్పృహ ఉంటున్నాయన్నారు. రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ఇందులో ప్రజల భక్తి శ్రద్ధలకు సాంస్కృతిక చైతన్యానికి నిదర్శనంగా ప్రభుత్వ సహకారంతో బతుకమ్మ, నవరాత్రి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, అధికారికంగా నిర్వహించే బతుకమ్మ సంబరాలను తమ ఓరుగడ్డలోని వేయిస్తంభాల ఆలయం నుంచి ప్రారంభింపజేసుకోవడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ.. రాణి రుద్రమ పాలించిన కాకతీయుల గడ్డపై ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ ఆటలు ఆడుతూ, పాటలు పాడడటం అద్భుత దృశ్యమని పేర్కొన్నారు. మహిళలంతా తొమ్మిది రోజులు ఆటలాడుతూ నిత్య నైవేద్యంగా సమర్పించిన ప్రసాదాలు సమర్పించుకుంటున్న క్రమంలో కష్టసుఖాలు పంచుకునే పర్వమే బతుకమ్మ అని అన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. రెండో రాజధానిగా చారిత్రక ఓరుగల్లు నగరంలో బతుకమ్మ వేడుకలను ప్రారంభింపజేయాలని తలపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈసారి వేడుకలను తన నియోజకవర్గకేంద్రమైన హనుమకొండలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోని సగం మంది కేబినెట్ మంత్రులు, పదిమందిదాక కార్పొరేషన్ చైర్మన్లు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ కార్యక్రమాలకే వన్నె తెచ్చారని అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ బతుకమ్మ పేరిట రాష్ట్ర సాంస్కృతిక శాఖ సారథి చైర్మన్ వెన్నెల ఆధ్వర్యంలో రూపొందించిన సీడీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇతర మంత్రులతో కలిసి ఆవిష్కరించారు.

కాగా, ఆలయానికి చేరుకున్న మంత్రులు, ఇతర అధికార గణానికి దేవాదాయశాఖ పక్షాన ఏసీ రామాల సునీత, ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతించారు. రుద్రేశ్వరుడి సన్నిధిలో మంత్రుల పేరిట పూజలు నిర్వహించారు. రుద్రేశ్వరుడి సన్నిధి నుంచి మహిళా మంత్రులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్‌తో సహా బతుకమ్మలను నెత్తిన ఎత్తుకొని వేడు కలకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా అధికార దర్పంతో కిటకిటలాడింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయి, రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, గట్టు మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ పాట పాడుతున్న మంత్రులు సురేఖ, సీతక్క

వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ

ఊరూవాడా సందడే సందడి


ములుగు శివాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఏటూరునాగారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కాటారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మను పేరుస్తున్న కాటారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తిరుమల


బతుకమ్మతో మెప్మా ప్రాజెక్టు అధికారి రాజేశ్వరి


చిట్యాల మండలం చింతల్లపల్లిలో బతుకమ్మ


ములుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వెంకటాపూర్ మండల కేంద్రంలో బతుకమ్మ సందడి

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్


సమావేశంలో ముఖ్య నేతలు, కార్యకర్తలతో పైడాకుల అశోక్

గోవిందరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ కోరారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షులు బొల్లు దేవేందర్, పాలడుగు వెంకటకృష్ణల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో అశోక్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 23న మేడారంలో జరిగే జాతర అభివృద్ధి పనులను పరిశీలించనున్నారని అన్నారు. మేడారం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో అభివృద్ధి ప్రణాళికలు ఖరారు చేస్తారని అన్నారు. ప్రతి కార్యకర్త పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు మద్దాలి నాగమణి, పల్లె జయపాల్‌రెడ్డి, గుడ్ల దేవేందర్, జెట్టి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

● తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి మేడారం రానుండగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.దేశం గర్వించేలా గిరిజన జాతర అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

● మంగపేట (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య కోరారు. మంగపేటలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ములుగు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన ఉన్నందున జిల్లా స్థాయి అధికారులందరూ ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. దీంతో ఈ వారం ప్రజావాణిని రద్దు చేశామని పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ములుగు టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ పంట వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మండల ఉప అధికారి హరీశ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. గత సంవత్సరంలా టెంపరరీ రిజిస్ట్రేషన్ ఉండబోదని, తమ పంట వివరాలు ఆన్‌లైన్‌లో చూపించకపోతే ప్రభుత్వం ఉత్పత్తులను కొనుగోలు చేయదని పేర్కొన్నారు. వరి, పత్తి పంటల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న దినసరి కార్మికుల శిబిరాన్ని ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి టి.ఎల్ రవి మాట్లాడుతూ ప్రజా పాలన తీసుకొస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ కార్మిక లోకాన్ని మోసగించిందని ఆరోపించారు. కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా, జీతంతో కూడిన వారపు సెలవులు, రెండు జతల యూనిఫాం, గుర్తింపు కార్డులు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవితేజ, డీవైఎస్ఐ జిల్లా నాయకుడు లాజర్, హాస్టల్, వర్కర్స్ నాయకులు ఎం. నాగలక్ష్మి, విజయలక్ష్మి, కమల, జయలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా జగన్మోహన్



మంగపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా బ్రాహ్మణపల్లికి చెందిన బడే జగన్మోహన్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆదివారం ప్రకటించారు. తన నియామకానికి సహకరించిన నేతలందరికీ జగన్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

కాళేశ్వరంలో మహా అన్నదానం


అన్నదానం కార్యక్రమంలో రాజబాబు తదితరులు

మహదేవపూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో పితృ అమావాస్య ఆదివారం సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి దేవస్థాన ఆవరణలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహదేవపూర్ గ్రామానికి చెందిన నూక సత్యనారాయణ, ఆయన మిత్రులు దీనిని నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ సింగిల్ విండో చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ రేపల్లి మమత నాగరాజు, దేవస్థానం మాజీ డైరెక్టర్లు గంధసిరి సత్యనారాయణ, మెంగాని అశోక్, సీనియర్ నాయకుడు గంధసిరి మధుసూదన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే : బీజేపీ


నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

టేకుమట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ పార్టీల నాయకులు దొందూ దొందేనని బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగల రాజేందర్ విమర్శించారు. అక్రమ ఇసుకను అరిట్టాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు అధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే కాంగ్రెస్, అలాగే బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా విమర్శలు చేసుకోవడం చాలా విడ్డూరమన్నారు. అధికారంలోకి రాగానే గండ్ర వెంకటరమణారెడ్డి అక్రమాలను ప్రజాక్షేత్రంలో ఉంచి అయన్ను జైలుకు పంపుతామని మాట్లాడిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణరావు ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అప్పుడు వెంకటరమణారెడ్డి, ఇప్పుడు సత్యనారాయ ణరావు అధికారాన్ని అడ్డుకొని అనుచరుల ద్వారా దందాలకు పాల్పడతున్నారని ఆరోపిం చారు. టేకుమట్ల మండలంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న ఇసుక దందాను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమ ర్శించారు. ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల అజయ్, కూర సురేందర్‌రెడ్డి, బండారి సమ్మయ్య, శ్రీపతి రవి, అంకల స్వామి, తిరుపతి, ప్రభాకర్, పంజాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా వెనుక కాంగ్రెస్ నేతలు : బీఆర్ఎస్

కాటారం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా అధికార కాంగ్రెస్ పెద్ద నాయకుల అండదండలతోనే జరుగుతోందని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ నేతలతో కలిసి కిరణ్ మాట్లాడుతూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మానేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. డంపుల నుంచి లారీల్లో జీరో ఇసుకను లోడ్ చేసి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. పోలీసులు అడపదడపా పట్టుకుంటున్నా ట్రాక్టర్లు సైతం చిన్న స్థాయి కార్యకర్తలవేనని, లారీలు, టిప్పర్లతో హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుగుతుండగా అప్పుడప్పుడు ఒకటి, రెండు ట్రాక్టర్లు మాత్రమే పట్టుబడటాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మానెం రాజబాపు, చెన్నూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

కాటారం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి, మలి తెలంగాణ ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షుడు దోమల సమ్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గంలో ముందుకెళ్తూ అయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దోమల సమ్మయ్య, సంఘం నాయకులు పులి అశోక్, పల్నాటి బలరాం, మాచర్ల రాజేందర్, వలస వెంకటేశ్వర్లు, కొండ వెంకటేశ్వర్లు, గాదె రమేష్, అమృత సంతోష్, దాసరి గట్టయ్య, ఎలగం రాజనారాయణ, రవీందర్, సత్యనారాయణ, దోమల రాజశేఖర్, సురేష్, కనుకుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నాయకులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గండ్ర పరామర్శ


నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల కృష్ణ, కొత్తపేటకు చెందిన జాలిగపు కొమురయ్య, అందుకుతండకు చెందిన దాసారపు రాజయ్య, నైన్‌పాకకు చెందిన వావిళ్ల రాములు, మండ రాజక్క, బిక్కనూరి లచ్చక్క పలు కారణాలతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళ్లు అర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ దబ్బెట అనీల్, నాయకులు గంగాదర రవీందర్, రమేష్, నక్క బాస్కర్, భద్రయ్య, శంకర్ ఉన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో ‘కల్చరల్ మీట్’

కృష్ణకాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలో సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కల్చరల్ మీట్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి సంస్థ కళాకారులు, ఉద్యోగుల మధ్య ఐక్యత, సమాజ దృక్పథమని తెలియజేసేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ మీట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిక్, డ్యాన్స్ తదితర వైవిధ్యమైన వినోదాల్ని పంచే కార్యక్ర మాల్ని నిర్వహించగా పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి

‘విషాద’యాత్ర

(5వ పేజీ తరువాయి)

ఎస్సై జక్కుల సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీటము నిగి న మహేశ్విన్‌ను గాలింపు చర్యలను చేపట్టిన వారిలో ఫైర్ సిబ్బంది అనిల్, శ్రావణ్, రవికుమార్, రాజేందర్, ఎఫ్‌బీవో లక్ష్మణ్‌దాస్ ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూసి..

మహేశ్విన్‌కు యూట్యూబ్ వ్లాగ్స్ చేసే అలవాటు ఉంది. జలపాతం వద్దకు చేరుకునే క్రమంలో ఓ సెల్ఫీ వీడియో సైతం తీసుకున్నాడు. ఇన్‌స్టాలో రీల్స్ చూసి దుసపాటి జలపాతం వద్దకు వచ్చామని మహేశ్విన్ స్నేహితులు చెప్పారు. ఇంత ప్రమాదం జరుగుతుందని తాము ఊహించలేదని కన్నీరుమున్నీరయ్యారు.

అనుమతి లేకపోయినా..

జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలలో ఉన్న దుసపాటిలొద్ది, మాసంలొద్ది, ముత్యంధార, మహితాపురం, ఏనుగుసరి, గుండం జలపాతాల సందర్శనలను అటవీ శాఖ అధికారులు నిలిపివేశారు. ఈ మేరకు ప్రకటనలు సైతం జారీ చేశారు. అయినప్పటికీ కొంత మంది పర్యాటకులు అత్యుత్సాహంతో దొడ్డిదారిన జలపాతాల వద్దకు చేరుకొని ప్రాణాలు పోగుట్టుకుంటున్నారు. దుసపాటిలొద్ది జలపాతంలో ఇప్పటి వరకు ఆరుగురు మృతి చెందగా మహేశ్విన్ మృతితో ఆ సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ సంఘటనలకు ఫారెస్టు అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంత మంది పర్యాటకులు జలపాతం వద్దకు వెళ్తున్నా అడ్డుచెప్పటం లేదని అంటున్నారు.

ఇసుక దందాకు కేరాఫ్ వెంకటరమణారెడ్డి : కాంగ్రెస్

టేకుమట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇసుక దందాకు కేరాఫ్ అడ్రస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతిమణి గండ్ర జ్యోతి అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ దందాకు పాల్పడిన గండ్ర వెంకటరమణారెడ్డి ఇసుక అక్రమ రవాణా గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి బండి రవీందర్, టౌన్ అధ్యక్షులు పెరుమాండ్ల క్రాంతి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీకాంత్, నాయకులు వంగ నరేష్, కొరె చందు, గొల్లపెల్లి వెంకటేశ్వర్లు, అనిల్, నేనటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు సక్రమంగా చెల్లించాలి : టిప్పర్ డ్రైవర్లు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 10వ తేదీలోగా తమకు జీతాలు చెల్లించాలని కాకతీయఖని ఓసీ-2 వోల్వో టిప్పర్ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తాము సమ్మె బాట పట్టినట్లు చెప్పారు. తాము వెట్టిచాకిరీ చేస్తున్నామని, జీతాలు సమయానికి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. జీతాలు అడిగితే సైట్ ఇన్‌చార్జి దురుసుగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. రామగుండం, గోదావరిఖని ఏరియాల్లో తరహాలో వేతనాలు వేతనాలతు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బడితెల మహేందర్, గుమ్మడి రమేష్, బొద్దుల హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల ఆవిర్భావ వారోత్సవాలు.. పోలీసుల అప్రమత్తం


జగన్నాథపురం వైజంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాజేడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే మావోయిస్టులు వెంకటాపురం మండలంలో కరపత్రాలు వదిలి కలకలం రేపగా పోలీసులు ఏజెన్సీలో హై అలర్ట్ ప్రకటించారు. మావోయిస్టుల కంచుకోట అయిన కర్రెగుట్టల్లో ఈ ఏడాది కేంద్ర బలాగాలు ఆధీనంలోకి తీసుకొని కీలక నేతలను మట్టుబెట్టాయి. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని చెప్పటికీ కేంద్ర ప్రభుత్వం ససేమిరా అనడం, వచ్చే ఏడాది నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించడంతో కీలక నేతలు, మిలిటెంట్లు, కొరియర్లు, సానుభూతి పరులు లొంగిపోయారు. ఈ క్రమంలో మావోయిస్టు కీలక నేతలు పార్టీ ఆవిర్భావ వేడుకలు పిలుపునిస్తూ లేఖలను విడుదల చేశారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఏజెన్సీలో అలజడులు సృష్టించే ఆస్కారం ఉందని భావించిన పోలీసులు ఏజెన్సీలో రాత్రింబవళ్లు విస్తృత సోదాలు చేస్తున్నారు. ముఖ్యంగా గోదావరి ఫెర్రిపాయింట్లు, అంతర్ రాష్ట్ర వంతెనలు, ప్రధాన కూడళ్లలో సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. పోలీసులకు ఉన్న ప్రత్యేక వ్యవస్థ తో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. అనుమానితులను అదుపులోకి తీసుకొని మావోయిస్టుల సమాచారం రాబడుతున్నట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు సాగించే ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఆధార్‌కార్డు వివరాలను సైతం పరిశీలిస్తున్నారు. మావోయిస్టులకు టార్గెట్‌గా ఉన్న రాజకీయ నాయకులు, వ్యాపారులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సిం దిగా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.. ఏజెన్సీల అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్న భారీ యంత్రాలను వాజేడు, పేరూరు, వెంకటాపురం పోలీస్‌స్టేషన్‌లకు తరలించి భద్రత కల్పిస్తున్నారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లకు సైతం భద్రతను పెంచి కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు నిత్యం పోలీసులు తనిఖీలు, మరోవైపు మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వేడుకలు ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఏజెన్సీ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984,
Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram
SR - 7673960447 ACM - 9985411664